క్లుప్తంగా

కవయిత్రికి ఉగాది పురస్కారం



ఆత్మకూర్: పట్టణానికి చెందిన కవయిత్రి బండారు సునీతకు శ్రీకురుమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ ట్రస్ట్ ఉగాది సాహితి సేవా పురస్కారం లభించింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న బండారు సునీత ఇది వరకే ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. ఆదివారం కురుమూర్తిస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్, డీటీ సునీల్‌కుమార్, నిర్వాహకులు బెల్లం సాయిలు, లుంబిని లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్, కవులు, కళాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు బండారు సునీతను అభినందించారు.

ప్రమాదకర గుంతను పూడ్చండి



వీపనగండ్ల: మండలంలోని వంటిమిట్ట తండాలో మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతు కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని తండావాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రమాదకర గుంతను పూడ్చాలని పంచాయతీ సిబ్బందిని అడిగితే భగీరథ పనుల రిపేర్ కోసం ఒకటే జేసీబీ ఉందని, అది వస్తేనే గుంతను పూడ్చేందుకు వీలు అవుతుందని అంటున్నారని తండావాసులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గుంతను పూడ్చి చదును చేయాలని తాండావాసులు కోరుతున్నారు.

అడుగంటుతున్న బావులు



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల సమీపంలో ఉన్న బావులు ఐదేళ్లుగా ఎన్నడైలేని విధంగా అడుగంటిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు గ్రామ సమీపంలో ఉన్న బావుల్లో వేసవి తాపాన్ని తీర్చుకోవడంతో పాటు చిన్నారులు ఈత నేర్చుకునేందుకు బావుల్లో పుష్కలంగా నీరు ఉండి ఉపయోగకరంగా ఉండేవి. కల్వరాల్ల గ్రామ సమీపంలో మెట్లబావి ఎన్నడూ లేని విధంగా నీటి శాతం పడిపోయిందని గ్రామస్తులు చెప్పుతున్నారు.

'హరిత' మొక్కలు అగ్గిపాలు



పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న పీఆర్ రోడ్డు పక్కన హరితహారంలో పెంచిన చెట్లకు మంటలు అంటుకొని బూడిద అవుతున్నాయి. రోడ్డు పక్కన ఉన్న హరితహారం చెట్లకు పక్కనే ఉన్న పంట పొలాల్లోని వరి కొయ్యలకు రైతులు నిప్పు పెట్టడంతో ఆ మంటలు అలానే వ్యాపించి పక్కనే ఉన్న హరితహారం చెట్లకు అంటుకొని చెట్లు కాలిపోతున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల రైతులకు తమ పొలాల్లోని వరి కొయ్యలు, చెత్తను అంటించే సమయంలో మంటలు పక్కనే ఉన్న హరితహారం చెట్లకు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవని, పెరిగిన చెట్లకు నష్టం వాటిల్లిదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, పెబ్బేరు ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాలలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలను ఆలయ చుట్టూ తిప్పి పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన తినుబండారాల దుకాణాలు వద్ద భక్తులు సందడి చేశారు. మొత్తం ఎనిమిది వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు పేర్కొన్నారు.

ఉప్పరిపల్లిలో తాగునీటి ఎద్దడి



ఉప్పరిపల్లిలో ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

- వారం నుంచి సమస్య తీవ్రం
- ట్యాంకర్లతో సరఫరా చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి
- ఒకే ట్యాంకుకు మిషన్ భగీరథ నీరు

ఉప్పరిపల్లి గ్రామ జనాభా	2,350	
కుటుంబాలు	బోరుబావులు	పని చేసేవి
456	5	3
ఓవర్ హెడ్ వాటర్ ట్యాకులు	మినీ ట్యాంకులు	
3	4	

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లిలో తాగునీటి సమస్య ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. రోజు రోజుకూ భూగర్భజలాలు అడుగంటి పోతుండడంతో గ్రామానికి తాగునీరు అందించే బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోయాయి. ఇక గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ నీటితో ఒక ట్యాంకును మాత్రమే నింపుతున్నారు. గ్రామానికి పక్కన్నే ఉన్న సోళీపురం సంపు నుంచి కాకుండా వీరాయిపల్లి నుంచి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తుండటంతో నీటి కొరత ఏర్పడింది. గ్రామానికి కొన్నేళ్లుగా పుష్కలంగా తాగునీరు అందిస్తున్న తిప్పల్‌చెరువు వెనకాల ఉన్న బోరుబావిలో నీటి మట్టం తగ్గడంతో మూడు రోజులకు ఒక వాటర్ ట్యాంకు నిండుతుంది. చేసేది లేక అధికారులు గ్రామంలోని మండ్ల గేరిలో పాడైన బోరుమోటార్‌కు మరమ్మతులు చేయించి నేరుగా పైపులైన్ ద్వారా నల్లాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో కొన్ని కుటుంబాలకు తాగునీరు అందుతుంది.



60 కుటుంబాలకు తీవ్ర ఇబ్బంది

గ్రామంలోని అన్ని ప్రాంతాలకు కొద్దిపాటి తాగునీటిని సరఫరా చేస్తున్నా.. ముఖ్యంగా వడ్డెగేరి, ఎస్సీ వాడ మండ్లగేరిలోని 60 కుటుంబాలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారికి నల్లాల ద్వారా నీళ్లు రాకపోవడంతో గ్రామ పంచాయతీ వారు సరఫరా చేస్తున్న నీళ్ల కోసం ఎదురు చూస్తుంటారు. ఉన్నతాధికారుల సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీతో పాటు సూరాయపల్లి పంచాయతీ ట్యాంకర్ ద్వారా గ్రామంలోకి కాలనీలకు నీటిని అందిస్తున్నారు.



గ్రామ పంచాయతీ సమీపంలో నిరుపయోగంగా మినీ వాటర్ ట్యాంక్

తాగునీరు రావడం లేదు



మా గేరికి తాగడానికి నీళ్ల సక్రంగా రావడం లేదు. గతంలో పుష్కలంగా వచ్చేవి. వారం రోజులుగా ఇబ్బందిగా ఉందని పంచాయతీ కార్యదర్శిని అడిగినం. బోర్లలో నీళ్ల తగ్గాయని, పాతబోర్లలో మోటార్లు దించి సరిపడా నీళ్ల ఇస్తామన్నారు.

– దేవరకొండ రాములు, ఉప్పరిపల్లి

సోళీపురం సంపు నుంచి..



మా గ్రామంలో తాగునీళ్ల సక్రమంగా రావడం లేదు. మిషన్ భగీరథ నీళ్ల వచ్చే పైపు లైన్ వీరాయిపల్లి నుంచి ఉంది. అలా చేయడం వలన నీళ్ల సరిపడా రావడం లేదు. సోళీపురంలో ఉన్న సంపు నుంచి నీళ్ల వచ్చేలా పైపు లైన్ ఏర్పాటు చేయాలి.

– రాగనమోని సత్యన్న

ఇంటి వద్దే బోరు బావి ఉన్నా..



మా గేరికి తాగు నీళ్ల రావడం లేదు. మా ఇంటి ఎదుటే ఊరికి నీళ్ల ఇచ్చే బోరుబావి ఉంది. కానీ మాకు మాత్రం నీళ్ల రావు. ఈ బోరు నుంచి నర్సరీ వద్ద ట్యాంకర్లకు నింపుతున్నారు. ఇప్పుడు సర్పంచ్ లేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు.

– బంగారం బాయి నాగమ్మ

మోటార్ల కోసం ప్రతిపాదన

గ్రామంలో తాగునీటి సమస్య ఇటీవల ఎక్కువైంది. రెండు బోరు మోటార్లు, 250 మీటర్ల పైపులైన్ అవసరం ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. మోటార్లు మంజూరయ్యాయి. వెంటనే పైపులైన్ చేయించడంతో పాటుగా ఖాళీగా ఉన్న బోరుబావుల్లో మోటార్లు దింపి ప్రజలకు తాగునీళ్ల అందిస్తాం. త్వరలోనే సమస్యను శాశ్వత పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శరత్‌చంద్ర, పంచాయతీ కార్యదర్శి, ఉప్పరిపల్లి

అసంపూర్తిగా వంట గది నిర్మాణం



బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో అసంపూర్తిగా వంట గది నిర్మాణం



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు మన ఊరు–మన బడి పథకంలో వంట గది నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా వంట గది అసంపూర్తిగానే మిగిలి ఉంది. దీంతో పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో వంట ఏజెన్సీ వారు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఈ రేకుల షెడ్డులో వంటలు చేయడం ఇబ్బందిగా ఉందని వంట ఏజెన్సీ మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తి వంట గది నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ మహిళలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పాలనలో వడ్డెరలకు న్యాయం చేస్తాం

వనపర్తి టౌన్: వడ్డెరలు కాంగ్రెస్ హయాంలో ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వారి అభ్యున్నతి సాధిస్తారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వడ్డెరలను గుండెల్లో పెట్టి చూసుకుంటామన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జెరిపేటి జైపాల్ సన్మాన వేడుకల్లో వారు పాల్గొని ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. వడ్డెరల కుల వృత్తికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వడ్డెరలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు తగు చర్యలు చేపడతామని చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంతో చర్చించి వారి సమస్యలు పరిష్కరిస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు, ప్రధాన కార్యదర్శి ఎత్తిరి గణేష్, వైస్ చైర్మన్ కుంపు దేవరాజ్ బాలరాజ్, ప్రచార కార్యదర్శి చెనయ్య, కాంగ్రెస్ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, కౌన్సిలర్లు బ్రహ్మం, సుమిత్ర, చీర్ల సత్యం, లక్ష్మి, విభూది నారాయణ, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, నాయకులు యాదగిరి, రవి యాదవ్, నందిమల్ల చంద్రమౌళి, ద్యారపోగు వెంకటేష్, మన్నెంకొండ, ఆదిత్య, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలి

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని విలియంకొండ, నాటవెళ్లిపెద్దతండా గ్రామాల్లో భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఏప్రిల్ 5న ప్రబోధానంద యోగీశ్వరుల పుట్టిన రోజు సందర్భంగా భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేసినట్టు త్రైత సిద్ధాంత సేవాసమితి మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఎంతో గొప్ప వ్యక్తని ఆధ్యాత్మికంలో చక్రవర్తి అని భగవద్గీత గ్రంథాలను చదివిన వారు చెబుతారన్నారు. దేశంలో ఇంత వరకు అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత అను సిద్ధాంతాలు హిందూ మతంతో ఉన్నాయని, వాటి యొక్క సంపూర్ణతను గురువు యోగీశ్వరులు ప్రతిపాదించారని తెలిపారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలోని 16, 17 శ్లోక ఆధారంగా జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల విధానంలో వివరించడంతో చాలా గొప్పగా త్రైత సిద్ధాంత భగవద్గీత వివరం రాశారన్నారు. భగవద్గీతను చదివిన వారు ధన్యులన్నారు. కార్యక్రమంలో మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, సిమ్మయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత సేవాసమితి సభ్యులు

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రంలో క్యాన్సర్ వ్యాధితో మృతిచెందిన మల్లేష్‌యాదవ్ మృతదేహానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాముయాదవ్, బ్రహ్మయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో చంద్రయ్యయాదవ్, నరేందర్‌గౌడు, సింగోటం, నిరంజన్‌యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఓఈలో విద్యార్థుల ప్రతిభ

అమరచింత: మండల కేంద్రంలోని విజేత హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నుజుహత్, శ్రీకాంత్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహించే కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫేజ్ 2కి ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే ఉత్తమమైన గౌలిదొడ్డి క్యాంపస్‌లో ఉచిత రెసిడెన్షియల్ సౌకర్యాలతో నీట్ కోచింగ్ ఇవ్వబడుతుందని పాఠశాల కరస్పాండెట్ లక్ష్మీనారాయణ, హెడ్‌మాస్టర్ మోహన్ తెలిపారు. పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు బుక్క ఖాజాహుస్సేన్, కృష్ణయ్యలను అభినందిస్తూ విద్యార్థులను సత్కరించారు. అదే విధంగా అమరచింతకు చెందిన మహిపాల్ కుమార్తె సువర్ణరాణి అదే కాలేజీకి ఎంపికైంది, సువర్ణరాణి ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ హైస్కూల్‌లో చదవుతుంది.



పశుగ్రాసం దగ్ధం

పాన్‌గల్: ప్రమాదవశాత్తుతో పశుగ్రాసం దగ్ధమయిన ఘటన బుసిరెడ్డిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోమారిశంకరయ్య గ్రామ సమీపంలో పశువుల మేత కోసం ఐదు ట్రాక్టర్ల పశుగ్రాసం (వరిగడ్డి), రెండు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు నిల్వ చేసుకున్నాడు. నిల్వ చేసిన పశుగ్రాసానికి అకస్మాత్తుగా మంటలు వ్యాపించి మొత్తం దగ్ధమైంది. ఈ విషయాన్ని జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం వచ్చే లోపు పరిసరాల రైతులు, గ్రామ యువత కలిసి మంటలు పక్కకు వ్యాపించకుండా సమీపంలోని బోరు నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుందా.. లేక ఎవరైనా నిప్పు పెట్టారా అనే విషయం తెలియాల్సి ఉంది. దీని నష్టం దాదాపుగా రూ.లక్ష వరకు ఉంటుందని రైతు వాపోయాడు. నష్టపోయిన రైతును ప్రభుత్వ పరంగా సహాయం చేసి ఆదుకోవాలని సీపీఎం మండల నాయకుడు సూర్యవంశం రాము డిమాండ్ చేశారు.



దగ్ధమవుతున్న పశుగ్రాసం

ఏసు చూపిన మార్గంలో నడవాలి

ఆత్మకూర్: ప్రపంచంలో శాంతి స్థాపన కోసం ఏసుక్రీస్తు తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన చూపిన సన్మార్గంలో అందరూ పయనించాలని పాస్టర్లు సీజేజర్మీయా, డేవిడ్, విద్యాసాగర్ అన్నారు. ఈస్టర్ డే సందర్భంగా ఆదివారం ఆత్మకూర్, మూలమళ్ల, రేచింతల, ఖానాపూర్, పిన్నంచర్ల గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బైబిల్ సూక్తులను వివరించారు. అంతకంటే ముందు గ్రామాల్లో శాంతి ర్యాలీలు నిర్వహించారు.

కల్వరి కొండలో..

అమరచింత: ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి వచ్చిన రోజును పురస్కరించుకొని ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఎంబీ కర్మేల్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించి, అక్కడి నుంచి కల్వరి కొండ వరకు భక్తి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. కల్వరి కొండలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈమేరకు పాస్టర్ హ్యాపీపాల్ మాట్లాడుతూ ఆనాడు పాపులను రక్షించడానికే ఏసు ప్రభువు శిల వేయబడ్డాడని, శిలువ వేసిన రోజు మానవులకు ఇచ్చిన మాట ప్రకారం మూడో రోజు ఏసయ్య తిరిగి జన్మించి తన సత్యాన్ని చాటాడన్నారు. అనంతరం చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మస్తీపురం, నందిమళ్ల, సింగంపేట, చంద్రగఢ్, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌పీటర్, దీనకుమార్, విజయకుమార్, ప్రకాశం, ఇమ్మాన్యుయేలు, ప్రభుదాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏసు క్రీస్తు మరణించి తిగి లేచిన దినంగా భావిస్తూ మండలంలోని అజ్జకొల్లు, మదనాపురం, దుప్పల్లి, గోపన్‌పేట, కొన్నూర్, కొత్తపల్లి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



అమరచింతలో ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు



ఆత్మకూర్‌లో ర్యాలీ



అమరచింత కల్వరి కొండలో..



గోపన్‌పేటలో..

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఆత్మకూర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

కొత్తకోట రూరల్: రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగు మాధవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గిరిజ అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ముస్లింలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మల్లు రవి, చల్లా వంశీధర్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాస్, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు ఆదివారం రాత్రి స్థానిక మస్‌జిదే నూర్‌లో నూరుల్ హుదా యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్ అలీంరషాది ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రజాక్, షాలీ, రహ్మాన్, ముబషీర్, అఫ్రిది, అమేర్, అఫ్రోజ్, తాహెర్, అక్బర్, ఉమేర్, షోహెబ్, నవీద్, మోసీన్, రజాఖ్, తౌఫీఖ్, జియాఉర్‌రహ్మాన్, ఇమ్రాన్, వాహిద్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



బలిజపల్లిలో..

శిథిలావస్థలో క్లబ్ భవనం

ఆత్మకూర్: రాజుల కాలం నాటి పురాతన కట్టడమైన క్లబ్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. అరూపమైన కట్టడాన్ని బాగు చేయకపోతే రాజుల భవనం కనుమరుగు అవ్వనుంది. ముక్కెర రాజవంశీయులు అమరచింత సంస్థానాధీశులుగా కొనసాగుతున్న కాలంలో ఇక్కడ ప్రతి ఏటా జరిగే స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరకు వచ్చే వారని చరిత్రకారులు చెబుతున్నారు. వారం రోజుల పాటు ప్రస్తుత భవనంలో విడిది చేసి జాతర ఉత్సవాల్లో పాల్గొనేవారని, కాలానుగుణంగా ఆ భవనాన్ని క్లబ్ నిర్వహణ కోసం ఇచ్చినట్లు చెబుతున్నారు. కొన్నేళ్లుగా భవనం వాడుకలో లేకపోడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. పురపాలక చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టి సారించి పురాతన కట్టడమైన క్లబ్ భవనానికి మరమ్మతులు చేయించి వాడుకలో తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన క్లబ్ భవనం

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చైర్మన్ అస్కని నరేందర్ ఆదివారం హైదరాబాద్‌లో విరాళాలను సేకరించారు. హైదరాబాద్‌కు చెందిన టెస్లా గ్లోబల్ సర్వీస్ ఐటీ మేనేజర్ మునిగంటి సంతోష్‌చారి రూ.51,116వేలను విరాళంగా అందజేశారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన జెడ్‌టీఈ టెలికం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ హెడ్ మెరుగు సతీష్‌కుమార్‌రెడ్డి రూ.31,116వేలను విరాళంగా అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కోరారు.



విరాళం అందజేస్తున్న సంతోష్‌చారి

ఆర్థికసాయం అందజేత

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన అనుపటి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ ఆదివారం పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. జంగం యాదయ్య, అనుపటి మాసయ్య, జయమ్మ, అబ్దుల్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

చిన్నచింతకుంట: బండ్రపల్లి మాజీ సర్పంచ్ మహేష్‌గౌడ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే పార్ల మెంట్ ఎన్నికల్లో అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు జానకిరాములు, వాకిటి యాదయ్య, కెంగూరి కృష్ణ, కోట్ల శ్రీనివాస్, మేస్త్రి నర్సింహులు, బొల్లు బాబు, నడిపన్నలతోపాటు పలువురు ఉన్నారు.

కవులు, కళాకారులకు సన్మానం



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో ఉగాధి నేపథ్యంలో బెల్లం సత్యమ్మ స్మారకార్థం సదరు ట్రస్ట్ వారు ఉమ్మడి పాలమూర్ జిల్లా కవులు, కళాకారులను ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం కవులు భీంపల్లి శ్రీకాంత్, వెల్దండ వెంకటేశ్వర్లు, శ్రీమతి అంబుజ, వీరారెడ్డి, బండారు సునీత, పద్మాలయాచార్య, అచంపేట వెంకటేష్, కొల్లాపూర్ హవని, వెంకటేష్, సమాజ సేవకులు, ఉత్తమ అధికారి కురుమన్న మాస్టర్ లకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి, వాఖ్యాత బెల్లం సాయులు, సీనియర్ న్యాయవాది వి. మనోహర్ రెడ్డి, ఆలయ ఈఓ మధనేశ్వరెడ్డి, లక్ష్మణ్ గౌడ్, మహబూబ్‌నగర్ డీటీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.